# కాకిగూడు... కె.తాయారమ్మ

''ఇవాళ వాళ్ళొస్తారా?''

వాళ్ళంటే ఎవరు?....

నిజంగా నీ అదృష్టమే ప్రతిమా అంటోంది పెద్దమ్మ....

అదృష్టమా? యిది దురదృష్టమా? ప్రతిమకి?

ఊరంతా నీరవ నిశ్శబ్దం ఆవరించింది. ప్రకృతి గాఢసుషుప్తిలో మునిగిపోయింది.

బ్రతుకుబరువును మోస్తున్న శ్రమజీవులకు రాత్రి ఒక వరం. ఆ నాలుగుక్షణాలు కంటినిండుగా నిద్రపోతారు.

ఘర్షణతో కూడిన జీవన వ్యవస్థయిది.

ఊరికి కొంచెం దూరంలో వున్న పాత పెంకుటింట్లో మాత్రం గుడ్డిగా ఓ దీపం వెలుగుతోంది ఆ దీపం ఏ క్షణంలో ఆరిపోతుందో తెలియదు ఆ వున్న కొంచెం చమురు ఆయిపోవస్తోంది.

ఆ దీపాన్నే తదేకంగా చూస్తూ పడుకున్న ప్రతిమలో ఎన్నో ఆలోచనలు సుళ్ళు తిరుగుతున్నాయి

తెల్లవారితే తన జీవితం యింకో మలుపుతిరుగుతుంది అది భవిష్యత్తుకి బంగారు సోపానం కావచ్చును కాని. . కాని. . . తన వర్తమానం"

ఆ ఆలోచనే భయంకరంగా వుంది.

ప్రతిమకి కన్ను మూడుచుకున్నా నిద్ర రావడంలేదు పక్కమీదనించి మెల్లగా లేచింది. వంశీ ప్రశాంతంగా నిద్రపోతున్నాడు. "వాడికి ప్రశాంతికాక యింకేమిటి?" 'బాల్యం మనిషికి ఒక వరం'. "సంవత్సరంన్నర వంశీకి ఈ ప్రపంచంతో ఏం సంబంధం?"

"మత్సర దారిద్ర్యంనించి బండ బ్రతుకునించి తొలగిపోయిన అనుభూతితో వర్ధనమ్మ నిశ్చింతగా నిద్రపోతోంది.

"నిశ్చింత కరువైన దెవరికి?"

మెల్లిగా వీధి తలుపు తెరుచుకుని ఇవతలికొచ్చింది ప్రతిమ.

ఇంకా తెల్లారడానికి చాలా టైమున్నట్లుంది.

తలుపు చప్పుడుకి కాబోలు ఇంటి ముందున్న కొబ్బరిచెట్టు మీంచి కాకి "కావ్" అంటూ అరిచింది.

"అబ్బా ఇదో గొడవ! అప్పుడే తెల్లారిందనుకుంటోందేమో ఈవిడగారు! అయినా తెల్లారితే తను ఇలా వీధిలోకి రాగలదా? ఆ కాకి తనని పొడిచి పొడిచి చంపదూ?" ఆశ్చర్యం! "ఆ కాకి పెద్దమ్మ నేం చెయ్యదు! తప్పటడుగులు వేస్తూ తిరుగుతున్న వంశీని ఏం చెయ్యదు! కాని.. . కాని ... తనని చూస్తేనే ఇనుప ముక్కుతో పొడవడానికి సిద్ధపడుతుంది. ఎందుకు?"

చల్లని పిల్లతెమ్మెర శరీరాన్ని తాకి గిలిగింతలు పెట్టింది. ఏదో హాయి. ఆ హాయి వెనకాల అంతర్లీనంగా కదిలేవేదన!

"బాధపడకే బిడ్డా! నీ బ్రతుకే మారిపోతోందే తొందర్లో!"

"రాబోయే బ్రతుకు తనకు శాంతి నిస్తుందా?"

లోపలి దీపం ఆరిపోయింది చమురు అయిపోయింది మరి" వంశీ ఒక్కసారి గునిసాడు. వెంటనే ఊరుకున్నాడు. పెద్దమ్మ వాడి పక్కలో పడుకున్నట్లుంది.

"పెద్దమ్మకి తనంటే ఎందు కింత ప్రేమ?" నడిసముద్రంలో నావలావున్న తనని ఒడ్డుకి చేర్చింది పెద్దమ్మ. ఆనాడు తను ఎంతో ఆనందించింది. ఆమెతో పాటే తను కూడా కాయకష్టం చేసుకుని జీవించవచ్చు!" అని. కాని. . పెద్దమ్మ స్వార్థం అనే సుడిగుండంలో చిక్కుకుపోయి తనని లాగుతోంది.

"ఆ ప్రలోభానికి తను కూడా లోనైపోతోందా? "అసలు వంశీ లేని తను జీవించగలదా? వంశీమీద ఆశ వదులుకుంటేనే తన కో భవిష్యత్తు ఏర్పడుతుంది! తన భవిష్యత్తు మాటకేం? వంశీకి ఉజ్వలభవిష్యత్తు ఏర్పడుతుంది! వాడు రేప్పొద్దున్న ఏ కలక్టరో, జిల్లా జడ్జియో అవుతాడు! అప్పుడు తనని కలక్టర్‌గారి తల్లి అనో, జిల్లా జడ్జిగారి మాతృమూర్తి అనో అంటారు! నిజంగా అలా... అంటారా? అప్పుడు తనెవరు? కేవలం . ఒక.... అనామకురాలు! తనని ఎవరూ గుర్తించరు! కాని. .. కాని. .. పెద్దమ్మ.. . ఇంకోలా చెప్తోంది! అంతా అయోమయం అగాధం! తను ఏమీ ఆలోచించలేకపోతోంది

అలా వీధి గడపలో స్తంభానికి

అనుకుని కూచున్న ప్రతిమకి లోకం అంతా అంధకారబంధురంగా కనుపించసాగింది.

ఇంతలో ఎదురింటి తలుపు తెరుచుకుంది. ఆ జీర్ణ శిధిల గృహంనించి ఇవతలికొచ్చా డతను. తనలాగే అతనికి కూడా తనలాగే నిద్రపట్టినట్టులేదు! అతను కూడా భవిష్యత్తుకు సోపానాలు వేస్తున్నాడు!

అతను సుందరమూర్తి! నిరుద్యోగ పర్వంలో తేలియాడుతున్న ఓ నిర్భాగ్య జీవి. చీకట్లో కూడా వెలుగుల్ని వెతుకుతున్న ఆశాజీవి.

ప్రతిమ పెదవులమీద చిరుదరహాసం వెలిగింది. "కొందరి వ్యక్తులకి పేరుకూ మనిషికీ సంబంధం వుండదు! సుందరమూర్తి! పేరు అందంగావుంది. కాని.... ఆకారం..... పీక్కుపోయిన ముఖం, లోతుకుపోయిన కళ్ళు, నల్లగా పొట్టిగా వుంటాడు. ఉన్న ఒకటి రెండు జతలబట్టల్నీ ఉతుక్కుని పొందికగా కట్టుకుంటా వుంటాడు.

చంకలో ఫైలుపట్టుకుని పది గంటలకి ఇల్లు వదిలి మళ్ళీ ఏ రాత్రికో నీరసంగా నిస్సత్తువగా ఇల్లు చేరుతాడు!

అప్పుడప్పుడు తనని చూసి పలకరింపుగా నవ్వుతాడు. ఎందుకో సుందరమూర్తిని చూస్తే తనకు జాలి!

తెల్లవారుతున్న దనడానికి సూచనగా కాకులు అరుస్తున్నాయి. "ఇంక తను లోపలికెళ్ళాలి!" లేకపోతే ఆ చెట్టుమీది కాకి తనని పొడుస్తుంది.

మెల్లిగా లేచింది. లోపలికెళ్ళడానికి.

పెద్దమ్మకాని లేస్తే "ఏమే ప్రతిమా అలా కూచున్నావు? నీకు మీ అయ్య మంచిపేరే పెట్టాడే! అచ్చం ప్రతిమలాగే వున్నావు!" అంటుంది. "ప్రతిమ" ఆ పేరులోని మధురిమను ఏనాడో మరచిపోయింది. చిన్నప్పుడు తనని తల్లితండ్రు లేం పిలిచారో తనకే గుర్తులేదు! కాని.... కాని మనసిచ్చిపుచ్చుకున్న వివేక్ మాత్రం "ప్రతిమా!" అని తియ్యగా పిలుస్తూ వుంటే తనని తానే మరచిపోయేది! కాని.... కాని..... ఇప్పుడా మధురనిస్వనం ఏది?"

వెచ్చని కన్నీటి బిందువులు జలజలా రాలాయి ప్రతిమ చెక్కిళ్ళమీదుగా. తూరుపురేకలు విచ్చుకుంటున్నాయి.



## ధర్మపథం

# శక్తి ప్రదర్శన

మనలో కొందరు శక్తి సామర్థ్యాలు కలిగి ఉంటారు. కొందరు శక్తి హీనులూ ఉంటారు. శక్తిహీనులలో కొందరు అహంభావపరులు ఆర్భాటం చూపుతూ "ఇలా చేస్తాం, అలా చేస్తాం" అని పలుకుతూ పై వారిని బెదరిస్తారు. శక్తి కలవారు లేనిపోని బడాయిలు కొట్టక మౌనం వహించి వుంటారు. అవసరమైనప్పుడు గాని తమ శక్తి చూపరు. వారిలో కొందరికి, ఇతరులు హెచ్చరిస్తేనే గాని తమ శక్తి సామర్థ్యాలు తెలియవు. హనుమంతుడా తెగకు చెందిన వాడు. అతడు గొప్ప సామర్థ్యం కలిగి ఉన్నా తన శక్తిని తెలుసుకోలేడు. ఇతర వానర వీరులు తన్ను ప్రశంసించి, ప్రోత్సహించిన మీదనే అతడు సముద్ర లంఘనానికి సంసిద్ధుడయినాడు.

కొందరు శక్తి సామర్థ్యాలు కలవారు- అంతవరకూ మౌనంగా ఉన్నా తమ కేదయినా క్షోభ కలిగినప్పుడే- తమ మహిమను గుర్తింప గలుగుతారు. ఆ తర్వాతనే ప్రతిఘటించడం జరుగుతుంది. దీనికి మనకు హనుమంతుడే దృష్టాంతం. అతడు మహా శక్తి సంపన్నుడయినా, ఆవిధంగా అతడనుకోలేదు. మహేంద్ర పర్వత ప్రాంతాన్నుంచి సముద్రం దాటి లంకకు ఎలా వెళ్లడమా! అని వానర వీరులాలోచిస్తున్నప్పుడు అతడు మౌనంగానే ఉండి పోయాడు. ఇతర వానర వీరులు అతన్ని ప్రశంసించి ప్రోత్సహించిన పిదపనే హనుమంతుడు సముద్రాన్ని దాటి లంకలో ప్రవేశించి,చూచి రమ్మంటే కాల్చివచ్చి తన శక్తి సామర్థ్యాలను ప్రదర్శించాడు.

ప్రాణాలను తీసే విష సర్పం తన దారిని తాను పోతూ ఉండగా ఎవరైనా దానిని కొట్టి చంపడానికి ప్రయత్నించినప్పుడే- తనకు అపాయం కలుగుతుందని తోచినప్పుడే బుస్సుమని పైకి లేస్తుంది.

కాళిదాస మహాకవి తన అభిజ్ఞాన శాకుంతల నాటకంలో ఈ విషయాన్నే ఇలా చెప్పాడు:-

"జ్వలతి చలితేంధనోఽగ్నిః
　　విప్రకృతః పన్నగః ఫణాంకురుతే,
ప్రాయః స్వం మహిమానం
　　క్షోభాత్ ప్రతిపద్యతే హి నరపి"

దూర్వాస మహర్షి శాపం వల్ల; తాను గాంధర్వ రీతిని వివాహ విస్మరించిన దుష్యంతుడు, ఆమె తన వద్దకు రాగా, తిరస్కరించి, శాప విముక్తి అయిన పిదప మిక్కిలి పశ్చాత్తాపం పొంది, విమనస్కుడై యుండగా, ఇంద్రసారధి మాతలి వచ్చి అతనికి ఉత్తేజాన్ని కలిగిస్తూ, పరాక్రమ ప్రదర్శనానికి దోహదమిస్తూ, తిరస్కరణిచే తన రూపం కానరాకుండా చేస్తూ, రాజ విదూషకుణ్ణి హింసిస్తాడు. అప్పుడు దుష్యంతుడు తన పరాక్రమ ప్రదర్శనకు సిద్ధపడతాడు. ఇది సముచితమైన సందర్భం.

శక్తి సామర్థ్యాలు కలవారు క్షోభం వంటి అవసరాలు ఉన్నప్పుడే శక్తిని ప్రదర్శిస్తారు.

– బులుసు వేంకటరమణయ్య

మెల్లిగా లోపలికి నడిచింది ప్రతిమ.

"లేచావా ప్రతిమా? తొందరగా తెములు! ఇవాళ ఉదయం వాళ్ళు వస్తామన్నారు! బాబుకి కూడా స్నానం చేయించు!" అంటూ ఉత్సాహంగా లేచి పెరట్లోకి నడిచింది వర్ధనమ్మ.

"ఇవాళ వాళ్ళొస్తారా? వాళ్ళంటే ఎవరు?" ధర్మారావుగారూ, యశోదమ్మ గారు....!

"నిజంగా నీ అదృష్టమే ప్రతిమా! ఆ పుణ్యదంపతుల దృష్టి నీ బిడ్డమీద పడడం! వాళ్ళకి పిల్లలు దొరకకనా? వంశీ పూర్వజన్మఫలం!" అస్తమానం వర్ధనమ్మ నోట్లోంచి వచ్చే మాటలివే!

"వంశీ అదృష్టవంతుడు కావచ్చు. కాని తను?"

ఇంకా వంశీ నిద్రలేవలేదు! మెల్లగా వీధిలోని బావిదగ్గర కొచ్చింది. ఒక్కసారి నెత్తిమీద పొడిచి పారిపోయింది కాకి.

"ఛీ! దీనికేం పొయ్యేకాలమో! తననే పొడిచి చంపుతోంది.

తలమీద చేతితో తడుముకుంటూ కళ్ళుపైకెత్తి చూసింది.

చెట్టుమీద కాకి పుల్లలతో గూడు కట్టింది. అందులోంచి కాకిపిల్లలు కాబోలు కావుకావు మని అరుస్తున్నాయి. "ఇదన్నమాట అసలుసంగతి?" అనుకుంది ఒక్కసారి. అంతలోనే మళ్ళీ అనుకుంది "కాకి గూడు పెట్టడానికీ తనకీ ఏమిటి సంబంధం?"

నాలుగు రోజుల క్రితం సంగతి ఒకటి గుర్తొచ్చింది ప్రతిమకి. ఆ రోజు ఉదయం క్రిందపడివున్న చిన్న కొబ్బరి పింజని మళ్ళీ చెట్టుమీదికే విసిరింది. అది గూడుకి తగిలిందికాబోలు? అసలుసంగతి బోధపడింది ప్రతిమకి.

దానికి తన బిడ్డల మీద, గూడుమీద ఎంత మమకారం! గాలివానకి గూడు రాలిపోతుందని తెలిసి కూడా విపరీతమైన కాంక్షపెంచుకుంటుంది దానిమీద.

వివేక్‌తో తన కాపరం మూడునాళ్ల ముచ్చట అయ్యింది. వంశీ కళ్ళు తెరవక ముందే వివేక్ కళ్ళు మూశాడు. దిక్కులేక

పిక్కటిల్లి పోయింది. అప్పుడు ఆదుకుంది దూరపు బంధువు వర్ధనమ్మ.

వర్ధనమ్మని తను పెద్దమ్మా! అని పిలుస్తుంది. ఆ పెద్దమ్మ ఒక శ్రీమంతుల ఇంట్లో వంట చేసుకు బ్రతుకుతోంది.

ఆయన ధర్మారావు గారు, ఆమె యశోదమ్మ గారు. పేర్లకి తగినట్లే వుంటా రంటుంది పెద్దమ్మ. "నిజంగా ధర్మారావు గారు ధర్మమూర్తి, యశోదమ్మ గారు గోపాల బాలుణ్ణి పెంచి పెద్ద చేసిన యశోదమ్మనే తలపిస్తారు!"

"వాళ్ళకి ఒక్కటే లోపం... బిడ్డలు లేరు!"

ఒకసారి అంది ప్రతిమ, "పెద్దమ్మా! ధర్మారావు గారితో చెప్పి నాకేదైనా ఉద్యోగం యిప్పించ రాదూ?" అని. తను ఇంటర్ వరకూ చదివింది పెళ్ళికి ముందే.

అలాగే అని అప్పటికి సమాధానం చెప్పి తరువాత కొన్నాళ్ళకు ఒక సంగతి మోసుకొచ్చింది. "ప్రతిమా! నిజంగా నువ్వు అదృష్టవంతు రాలివి! ధర్మారావు దంపతులు బిడ్డని పెంచుకోవాలనుకుంటున్నారు!" అప్పుడు నీ సంగతి చెప్పాను. వాళ్ళు సరే నన్నారు. పేద బిడ్డయితే తనకు మరీ మంచి దన్నారు! వాణ్ణి కలక్టర్నో, జడ్జీనో చేసి మురిసి పోవాలనుంది వాళ్ళకి. "ప్రతిమా! ఇంతకు మించిన ఆనందం నీకు మాత్రం ఏముంటుంది? బాగా ఆలోచించు!" అని.

రోజులు దొర్లి పోతున్నాయి.

ఇంతలో ఓ విచిత్ర మైన సంఘటన జరిగి పోయింది. అదే.... అది.... సుందరమూర్తి సంగతి.... సుందర మూర్తి ఎవరు? తానెవరు?

మనిషి అలికిడైతే తలెత్తి చూసింది.

ఎదురుగా సుందరమూర్తి నిలుచుని వున్నాడు. అతని నిర్జీవమైన కళ్ళల్లో ఏవో మెరుపులు! అతని ఎండిన పెదాల మీద సన్నని దరహాస రేఖలు! ఇతనిలో ఎంత ఆశ? కొంత కాలం క్రితం వరకూ ఇతని ముఖంలో దైన్యం గూడు కట్టుకుని వుండేది! కాని ఇప్పుడు? కొండంత గుండె ధైర్యం ద్యోతక మవుతోంది అతనిలో.

"వర్ధనమ్మ గారు నన్ను కూడా రమ్మన్నారు!" అన్నాడు నెమ్మదిగా.

అర్ధమైన దానిలా తల ఊపి "రండి!" అంది ప్రతిమ అతనికి దారి యిస్తూ.

ప్రతిమని ఆరాధనగా చూస్తూ అతను లోపలికి నడిచాడు.

"ఇంకా అక్కడే నిలబడ్డావా? లోపలికి రా!" అంటూ కేక లేసింది వర్ధనమ్మ.

మెల్లగా లోపలికి నడిచి వంశీని తయారు చేసి తను కూడా తయారయ్యింది.

ధర్మారావు దంపతులు వంశీని అడగడానికి వస్తున్నారు.

వర్ధనమ్మ ముఖంలో కోటి దివ్వెల కాంతి. మనసు నిండిన సంతృప్తి. ఆమె కూడా త్వరలోనే తన ఒక్కగా నొక్క


ఇంటింటి పత్రిక "ఇంతుల" పత్రిక

ఆంధ్రపత్రిక వారి అందాల పక్షపత్రిక

ఇంటిల్లిపాదికి ఆనందాన్నిచ్చే

సచిత్ర పక్షపత్రిక ఏది?–




ఇంకేది? కలువబాల

వివరాలకు 'ఆంధ్రపత్రిక' గాంధీనగర్, విజయవాడ-3కి వ్రాయండి!

కూతురు దగ్గిరకి ఉత్తర భారతం వెళ్ళిపోతుంది.

ఈ పాత ఇంట్లో తన కొత్త జీవితం ప్రారంభ మవుతుంది! ఆశ నిరాశల మధ్య ఆమె హృదయం కొట్టుకుంటోంది.

ఇంతలో వీధిలో కారు ఆగింది.

నవ్వుతూ ఎదురు వెళ్ళి వాళ్ళని సాదరంగా లోపలికి ఆహ్వానించింది వర్ధనమ్మ.

ఎర్రని డ్రస్‌లో ముద్దొస్తున్న వంశీని చూసి మురిసి పోయారు వాళ్ళు. మురిపెంగా ఎత్తు కున్నారు యశోదమ్మ గారు "నీ పేరేంటి బాబూ?" వాడి బుగ్గలు ముద్దాడుతూ ప్రశ్నించా రావిడ

"వంశీ!" అన్నాడు వాడు చిలకలా...

"మాతో వస్తావా బాబూ?"

"ఊఁ!" అన్నాడు వచ్చీరాని ముద్దు మాటల్తో. "చూశారా! వీడిప్పుడే ఎంత మాలిమి అయ్యాడో?" అంటూ భర్తకి అందిచ్చారు వాణ్ణి.

"అవునమ్మాయ్ వీణ్ణి మా కివ్వడానికి నీకేమైనా అభ్యంతరమా?" ధర్మారావు గారు ప్రశ్నించారు.

ప్రతిమ నోట్లోంచి మాట రాకమునుపే అందుకుంది వర్ధనమ్మ.. "ఎందు కిష్టం వుండదు బాబుగారూ! మీ లాంటి వాళ్ళ చేతుల్లో పెరిగే అదృష్టం ఎవరి కుంటుంది? మీ దగ్గర వాడుంటే నందసదనంలో వున్నట్టే! యశోదమ్మ గారి చేతి వెన్న ముద్దలు తింటూ హాయిగా జీవిస్తాడు వంశీ!"

క్షణకాలం ఆగి మళ్ళీ అంది వర్ధనమ్మ. ప్రతిమ వయస్సులో వుంది. "వంశీ ఆమె భవిష్యత్తుకి ఆటంక మవుతాడేతప్ప, ఏవిధమైన ఆనందాన్నీ కలిగించ లేడు! అందుచేత నేను చెప్తున్నాను వినండి బాబుగారూ! వంశీని మీరు పెంచుకోండి!"

ధర్మారావు దంపతుల ముఖాలు వికసించాయి.

ప్రతిమ మౌనంగా వుండి పోయింది.

వాళ్ళు వెళ్ళి పోయారు వెళ్తూ వర్ధనమ్మతో ఏదో చెప్పారు "దత్తత అయింతరువాత కాదు! ముందుగానే బాబుగారూ!" అంటోంది వర్ధనమ్మ.

"అయితే అలాగే!" దత్తత ముహూర్తం నిర్ణయించి కబురు చేస్తాం!" అంటూ కారెక్కి వెళ్ళి పోయారు.

ఒక్కసారి ప్రతిమ దగ్గరగా వచ్చి చెక్కిళ్ళు నిమిరి కణతలకి నొక్కుకుని లోపలికి నడిచింది వర్ధనమ్మ.

సుందరమూర్తి ఎప్పుడు వెళ్ళి పోయాడో తెలియ లేదు.

గతం, వర్తమానం, భవిష్యత్తు కలగాపులగంగా చేరి ప్రతిమని ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి.

రోజులు దొర్లి పోతున్నాయి.

మరొక్క నాలుగు రోజులలో దత్తత ముహూర్తం వుందని ధర్మారావు గారు కబురు పెట్టారు.

సన్నని బాధ మెలి తిరిగింది ప్రతిమలో.

"పెద్దమ్మా! ఇంక వంశీ ధర్మారావు గారింటికి వెళ్ళిపోతాడు కదూ? నేనక్కడికి వెళ్ళొచ్చా?" బేలగా ప్రశ్నించింది ప్రతిమ.


"ఎందుకు వెళ్ళకూడదే వెర్రిదానా! కాని.... కాని.... వాడు ధర్మారావు గారి బిడ్డ అన్న సంగతి నువ్వు మరచి పోకూడదు!"

గతుక్కు మంది ప్రతిమ.

భవిష్యత్తుని ఊహించలేక పోతోంది. తన జీవితాన్నెదో చక్క దిద్దినట్టు! తన భవిష్యత్తుకి బంగారు బాట వేసినట్టూ భావిస్తోంది పెద్దమ్మ. కాని.... కాని.... తను.... అలా.... జీవించ గలదా? వంశీలేని తన బ్రతుకేమిటి? వివేక్‌ని మరచి తను ఇంకొకరితో జీవితాన్ని పంచుకో గలదా?

ఒక్కసారి ఆమె అంతరంగంలో సుందరమూర్తి మెదిలాడు. ఊహలలో నే భరించలేక పోతోంది సుందరమూర్తిని. ఇక వాస్తవం....? "అసలు సుందరమూర్తి ఎవరు?" "తానెవరు?" మగతగా కళ్ళు మూతలు పడ్డాయి.

## గడుసులోకం —బాబు





## స్వీట్ పులావ్!


వేసవి సెలవల్లో మా ఇంటికి విచ్చేసిన మా అక్క, బావకు ఓ చల్లని సాయంత్రం క్రొత్తగా నేను నేర్చుకొన్న 'బీహారీ వంటకం' స్వీట్ పులావ్ వంట చేసి వడ్డించాను. ఈ వంటకం రుచి చూసి ముగ్ధులైన మా అక్క, బావగారు నాకు అభినవ 'నలభీముడు' అనే బిరుదునిచ్చారు.

నేను చేసిన 'బీహార్ వంటకం– స్వీట్ పులావ్' తయారి విధానం–

కావలసిన వస్తువులు : ఒక కప్పు అటుకులు, తేజ్‌పత్తా ఆకు (విరింజ ఆకు) ఒకటి, అర్థటీస్పూన్ జీలకర్ర,

# నలభీమపాకం

నలభీమపాకం




కిస్‌మిస్‌పళ్ళు– 10, జీడిపప్పు పలుకులు– 4, డాల్డా ఆరు టీస్పూనులు, ఒక ఏలక్కాయ, ఒక లవంగం, ఒక టీస్పూను చక్కెర, చిటికెడు ఉప్పు. —

తయారు చేయు విధానం : ముందుగా కప్పు అటుకులు శుభ్రంగా కడిగి నీళ్ళు వంచేసి ప్రక్కన పెట్టుకోవాలి. పొయ్యిపైన బాణలి పెట్టి నాలుగు స్పూనులు డాల్డావేసి, అందులో తేజ్‌పత్తా ఆకు చిన్న చిన్న ముక్కలుగా తుంచి ఆ ముక్కలు, జీలకర్ర, కిస్‌మిస్ పళ్ళు, ఏలకులు దంచిన పొడి, జీడిపప్పు పలుకులు, లవంగం వేసి బాగా వేయించిన తరువాత అటుకులు, ఉప్పు, చక్కెర వేసి కలిపి, మిగతా రెండు స్పూనుల డాల్డా వేసి కలిపి అయిదు నిముషాలు పొయ్యిపై ఉండ నిచ్చి, దింపాలి. ఇది వేడి వేడిగా తింటే బాగుంటుంది.

– ఇ. ఎస్. హరిబాబు, పాకాల

---

హృదయం ఎటో పరిభ్రమిస్తోంది. కొద్ది నెలలు గతంలోకి జారింది మనస్సు.

* * * * * *

వంశీని ఎత్తుకుని వీధిలో నిలుచుంది ప్రతిమ. ఇంకా వర్ధనమ్మ రాలేదు. రాత్రి తొమ్మిది గంటలయ్యింది. ఒంటరిగా వుండాలంటే ఏదో భయంగా వుంది.

ఎదురింట్లోంచి ఓ మానవాకారం నడిచి వచ్చింది.

"ఎవరూ?" క్రీనీడలో నిలుచున్న అతన్ని ప్రశ్నించింది.

"నా పేరు సుందరమూర్తి! మీ ఇంటికి ఎదురుగా వున్నాను! నా గురించి చెప్పాలంటే ఏమీ లేదు! నిరుద్యోగిని!" ఎండిన పెదవులలో నవ్వు వెల్లి విరుస్తుండగా అన్నాడతను!

అతని చొరవకి కాస్త విస్తుపోయినా, తనని తాను సంబాళించుకుని అంది ప్రతిమ, "డిగ్రీ చేశారా మీరు?"

"పోస్టుగ్రాడ్యుయేషన్ పూర్తి చేసేను. టైపు, షార్ట్ హ్యాండ్ నేర్చుకున్నాను! ఉద్యోగాల మార్కెట్‌లో దిక్కుతోచక నిలుచున్న అధమాధముణ్ణి!" మరోసారి ఎండిన పెదవుల మీద నవ్వు".

"పెద్దమ్మ లేదు!" ఇబ్బందిగా ఫీలవుతూ అంది.

'ఓ!" అని.... బాబూ నాతో వస్తావా?" అన్నాడు. బాబు సుందరమూర్తి దగ్గర కెళ్ళ లేదు. ప్రతిమ మెడ గట్టిగా కావలించుకున్నాడు.

"బాబు నన్ను చూసి భయపడు తున్నాడు!" అన్నాడు సుందరమూర్తి.

బాబుకే కాదు! తనకే భయం వేస్తోంది సుందరమూర్తిని చూస్తూ వుంటే!

కొంతసేపు ఏవేవో మాటలాడి తరువాత వెళ్ళిపోయాడు సుందరమూర్తి.

అది మొదలు సుందరమూర్తి తరుచు వస్తూనే వున్నాడు. పెద్దమ్మతో మాట్లాడి వెళ్తూ వుంటాడు. అప్పుడప్పుడు పెద్దమ్మ కూడా సుందరమూర్తి గదికి వెళ్ళి ఏవేవో మాట్లాడుతూనే వుంటుంది.

మాటల సందర్భంలో రెండు మూడు సార్లు అంది వర్ధనమ్మ, "సుందరమూర్తి చాలా మంచివాడే అమ్మాయ్! బాగా చదువుకున్న వాడు ఉద్యోగం వేటలో వున్నాడు. యాభై వేలు డిపాజిట్ కడితే ఏదో ఆఫీసులో ఉద్యోగం వస్తుందిట! పాపం అతనెలా తేగలడు?"

సుందరమూర్తి విషయంలో తన కెలాంటి అభిప్రాయం లేదు. కాని.... కాని.. . పెద్దమ్మ ఏవేవో ఆలోచిస్తోంది.

ఆ రోజు తనకి బాగా గుర్తు.

వర్ధనమ్మ ముఖం నిండా సంతోషం పులుముకుని వచ్చింది. "ప్రతిమా! నిజంగా నువ్వు అదృష్టవంతురాలివి! ధర్మారావు దంపతులకి బిడ్డ కావాలిట! వాళ్ళు ఏదో ముట్ట చెప్తానన్నారులే! దానితో నీ జీవితం ఓ కొలిక్కి వస్తుంది. నేను కూడా నా కూతురి దగ్గరకు పోయి హాయిగా ఈ చివరి రోజులు గడుపుతాను!" అంటూ చెవిలో ఏదో చెప్పింది.

"ఏమిటీ?" అంటూ ఆశ్చర్యంతో కళ్ళు వెడల్పు చేసింది ప్రతిమ.

అది మొదలు సుందరమూర్తి ముఖంలో నవ్వు కనుపిస్తోంది. ఆశ ఊపిరి పోసుకున్న కళ్ళలో ఏవో కొత్త వెలుగులు కనుపిస్తున్నాయి.

మనిషి ఎంత స్వార్థపరుడు?

ఎదుటి వాళ్ళ నిరాశ ఇంకొకరికి ఆశ! ఒకరి హృదయ వేదన ఇంకొకరి ఆనంద వాహిని.

పెద్దమ్మ, సుందరమూర్తి, ధర్మారావు దంపతులు అందరూ తలో రకంగా స్వార్థపరులే!

ఆ రోజు ఉదయం సంఘటన గుర్తొచ్చింది ప్రతిమకి. ఏదో ఆలోచిస్తూ నూతి గట్టుమీద

నిలుచుంది. కాకి రివ్వున ఎగిరి వచ్చి తల మీద పొడిచింది. ఇంకా నొప్పి తగ్గలేదు. కాకికున్న ఇంగితం తనకు లేకపోయింది. తన బిడ్డల్ని ఎవరు ఏం చేస్తారో అని దాని భయం!" మరి తను?"

ఆలోచనల మధ్య నిద్ర పట్టింది.

★ ★ ★ ★ ★ ★ ★

ఇల్లంతా అందంగా అలంకరిస్తోంది వర్ధనమ్మ. మరుచటి రోజే దత్తత. ఇక వంశీ శాశ్వతంగా తన నించి దూరమవుతాడు. సన్నని నీటి తెర కదిలింది ప్రతిమ కన్నులలో.

వర్ధనమ్మలో ఉత్సాహం పరవళ్ళు తొక్కుతున్నది రాను పోను వంశీని ముద్దులు పెట్టుకుంటోంది తన ముఖాన్ని చేతుల్లోకి తీసుకుని కణతలు నొక్కుకుంటోంది.

"ప్రతిమా నిజంగా నువ్వు అదృష్టవంతురాలివే! వంశీ మంచి ఇంట్లో పడ్డాడు. సుందరమూర్తి నిన్ను పెళ్ళి చేసుకుంటా నన్నాడు. త్వరలోనే సుందరమూర్తికి ఉద్యోగం కూడా వస్తుంది! నిన్ను చేరదీసినందుకు నాకీ నిశ్చింత చాలు! నేను ఎక్కడికి వెళ్ళిపోయినా బాధలేదు! ఆమె కళ్ళల్లో స్వార్థం గూడు కట్టుకుని వుంది.

క్షణ కాలం నిస్సహాయంగా చూసింది ప్రతిమ

వర్ధనమ్మ ఎక్కడెక్కడికో తిరిగి వస్తోంది. సుందరమూర్తి కూడా హడావిడిగా తిరుగు తున్నాడు.

"ఇతని కెంత సంబరం! "ఎద్దు పుండు కాకికి నొప్పి కలిగించదు! తన నుంచి యాభై వేలు గుంజి తనని స్వీకరిస్తాడన్న మాట? డబ్బుకి బిడ్డని అమ్ముకుంటోంది తను! కాకి తన బిడ్డల్ని ఎవరేం చేస్తారో అని అనుక్షణం కాపలా కాస్తోంది ఏమాత్రం అనుమానం వచ్చినా ముక్కుతో పొడిచి చంపుతోంది. కాని .. కాని.... తనకేదీ ఆ ఇంగితం" స్వార్థం వైపు పయనిస్తోంది. నిజంగా ఆలోచిస్తే తనూ, వర్ధనమ్మా, సుందరమూర్తి అందరూ స్వార్థపరులే! అందరూ అభం శుభం తెలియని వంశీనే పావుగా వాడుకుంటున్నారు దీనితో సుందరమూర్తి స్థాయి పెరుగుతుంది. తనని చేరదీసిన వర్ధనమ్మ కీర్తి ఇనుమడిస్తుంది. తనకి గృహిణీ స్థానం వస్తుంది.

"కాని.... కాని... తను వంశీని వదులుకోగలదా? ఏమిటీ వలయం?"

వర్ధనమ్మ అస్తమానం సందుకా పెట్టె దగ్గర కెళ్ళి తలుపు తెరిచి ఓ సారి సంతృప్తిగా చూసుకుని మళ్ళీ తిరిగి వస్తోంది.

"అందులో ఏముంది?"

రోజులో మూడు వంతులు కరిగిపోయాయి.

ఆ రాత్రి ఎంతకీ నిద్ర పట్టలేదు ప్రతిమకి.

మెల్లగా వీధిలోకి వచ్చింది. ఏదో అలికిడి కేమో కాకిగూడు లోంచి పిల్లలు కావుమని అరుస్తున్నాయి. జరజరమని ఓ పాము కాకిగూడు వైపు పాకుతోంది.

అంతే!... దృఢమైన నిర్ణయాని కొచ్చిన ప్రతిమ నెమ్మదిగా లోపలి కొచ్చింది.

వర్ధనమ్మని వాటేసుకుని పడుకున్నాడు వంశీ. వర్ధనమ్మ ఏదో నిశ్చింతను సంతరించుకుని గాఢ నిద్రా పరవశురాలై వుంది.

ప్రతిమ మెల్లగా వంశీని తీసి ఎత్తుకుని... సందుకా పెట్టె తలుపు తీసి, అందులోంచి వంశీ బొమ్మల బుట్ట తీసుకుని వీధి గుమ్మం దాటి స్టేషన్ వైపుగా నడిచింది

అప్పుడే వచ్చి స్టేషన్‌లో ఆగింది ప్యాసెంజరు బండి. తొందర తొందరగా ఓ పెట్టెలోకి ఎక్కి నిశ్చింతగా ఊపిరి తీసుకుంది.

★ ★ ★ ★ ★ ★ ★

గమ్యం తెలియని ప్రయాణం చేస్తున్న ప్రతిమని ఓ పేపరు వార్త ఆకర్షించింది. ఎదుటి బెర్తు అతను పేపరు చదువు తున్నాడు. అతని చేతిలోంచి పేపరు తీసి చూసింది "లక్ష రూపాయలు పట్టుకుని ఓ యువతి పరారీ! పట్టి యిచ్చినవారికి ఐదు వేల రూపాయల బహుమానం ఇట్లు: ధర్మారావు దంపతులు. వర్ధనమ్మ. సుందరమూర్తి.

ఏదో చిన్న స్టేషన్‌లో బండి దిగింది. ప్రతిమ బొమ్మల పెట్టె భద్రంగా పట్టుకుని. "వంశీ, నాన్నా నిన్ను విడిచి వుండలేను నేను! నీ కోసం ఓ గూడు నిర్మిస్తాను! నిన్ను పెంచి పెద్ద చేస్తాను! పద ఎవరికీ తెలియని చోటుకి పోదాం! అలా నడిచి పోయింది ప్రతిమ వంశీని ఎత్తుకుని. ●

